ప్రతి అక్షరం ప్రజాహితం

RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 358 పేజీలు - 05 వెల - 04/- గురువారం 12 సెప్టెంబర్ 2024





# గత ప్రభుత్వ పాపాలే ఇప్పుడు శాపాలు

## ప్రతి ఎకరానికి 10వేలు ఇస్తాం



- అన్ని విధాల ఆదుకుంటాం
- రైతుల అధైర్యపడొద్దు: చంద్రబాబు
- బెజవాడను ముంచింది జగన్ అండ్ కోనే
- ప్రకాశం బరాజ్ ను కూల్చే కుట్ర వాళ్లదే
- కొల్లేరు వరద ప్రాంతాలలో పర్యటన
- ఏలూరులో రైతన్నలతో ముఖాముఖి

## ఏపీ బీజేపీ చీఫ్ గా నల్లారి.?



2లో

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు రంగం సిద్ధం.!



2లో

# తెలుగు రాష్ట్రాల్లో వరదనష్టంపై నివేదిక

### నివేదికను అమిత్‌షాకు అందించిన శివరాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబర్11 ఆంధ్ర ప్రగతి: తెలుగు రాష్ట్రాల్లో జరిగిన వరద నష్టాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వివరించారు. బుధవారం న్యూడిల్లీలో వరద నష్టానికి సంబంధించిన ప్రాథమిక నివేదికను హోం మంత్రి అమిత్ షాకు వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అందజేశారు. ఈ విషయాన్ని మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. ఎడ తెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో వరద నీరు పోటెత్తింది. దీంతో తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి కృష్ణా జిల్లా అతలాకుతలమయ్యాయి. దీంతో ఆ యా జిల్లాలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. పదుల సంఖ్యలో మరణాలు సంభవించాయి. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. దాంతో వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. నేపథ్యంలో ఆ యా రాష్ట్రాల్లోని ఆ యా జిల్లాల్లో ఇటీవల కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్వయంగా పర్యటించారు. ముంపు ప్రాంతాల్లో సైతం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులతో కేంద్ర మంతి చౌహాన్ భేటీ అయ్యారు. వరద నష్టంపై ఉన్నతాధికారులు కేంద్ర మంత్రికి నివేదిక అందజేశారు. రోవైపు తెలుగు రాష్ట్రాల్లో వరద సాయం కింద రూ. 3,300 కోట్ల తక్షణ సాయన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సాయాన్ని వెంటనే విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఇంకోవైపు ఈ వరద విపత్తుపై తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ఉద్యోగ సంఘాలు సైతం స్పందించాయి. టాలీవుడ్ పరిశ్రమకు చెందిన పలువురు నటీనటులు సైతం భారీగా ఆర్థిక సాయాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే.

## ఏలేరు వరద వృద్ధితి పై సహాయ చర్యలు చేపట్టాలి.



ఆంధ్ర ప్రగతి మంగళగిరి సెప్టెంబర్ 11: ఏలేరు వరద ఉధృతిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా కలెక్టర్ తో బుధవారం ఉదయం ఫోన్ ద్వారా వరద పరిస్థితిపై చర్చించారు. ఎగువున కురిసిన భారీ వర్షాల మూలంగా ఏలేరు, తాండవ రిజర్వాయర్లకు ఇన్ ఫ్లో ఎక్కువగా ఉండటంతో జిల్లా వ్యాప్తంగా 62 వేల ఎకరాలు ముంపునకు గురయ్యాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. గండ్లు పడటం, రహదారులపైకి నీటి ప్రవాహం చేరటం వల్ల పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో పిఠాపురం రాపర్తి, పెద్దాపురం గుడివాడ, సామర్లకోట పిఠాపురం మార్గాల్లో రాకపోకలు స్తంభించాయని వివరించారు. **మిగతాది 2లో...**

## జగన్ కు హైకోర్టులో ఊరట.!




ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 11: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ చీఫ్ జగన్ కు ఏపీ హైకోర్టు ఊరట కల్పించింది. పాస్ పోర్ట్ రెన్యూవల్ విషయంలో జగన్ కు అనుకూలంగా తీర్పు వెలువరించింది. ఆయన పాస్ పోర్టును రెన్యూవల్ చేయాలని అధికారులను ఆదేశించింది. అంతేకాదు, రెన్యూవల్ టైమ్ ను ఐదేళ్లకు పొడిగిస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. దీంతో జగన్ విదేశీ పర్యటనకు అడ్డు తొలగినట్లైంది. ఏపీలో అధికారం కోల్పోయాక జగన్ కు అప్పటి వరకున్న డిప్లొమాటిక్ పాస్ పోర్ట్ నిబంధనల మేరకు రద్దయింది. దీంతో జనరల్ పాస్ పోర్ట్ కోసం ఆయన దరఖాస్తు చేసుకోగా ఐదేళ్ల జనరల్ పాస్ పోర్ట్ ఇవ్వాలని హైదరాబాద్ లోని సీబీఐ కోర్టు ఆదేశించింది. అయితే, విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టు జగన్ పాస్ పోర్ట్ కాలపరిమితిని ఏడాదికి కుదించడంతో పాటు పలు షరతులు విధించింది. దీనిపై జగన్ ఏపీ హైకోర్టును ఆశ్రయించగా.. ఐదేళ్ల గడువుతో జగన్ కు పాస్ పోర్ట్ జారీ చేయాలని తీర్పు చెప్పింది.

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి కీలక పదవి.!



ఆంధ్రప్రదేశ్ అమరావతి సెప్టెంబర్ 11: ఆసియా-పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ ఛైర్మన్ గా టీడీపీ నేత, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఎన్నికయ్యారు. ఢిల్లీలో జరుగుతున్న2వ ఆసియా-పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ లో 40 దేశాల సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా ఎంపీ రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ దేశం తరఫున దక్కిన ఈ గౌరవాన్నిబాధ్యతగా స్వీకరిస్తానని తెలిపారు. విమానయాన రంగాన్ని ప్రజలకు మరింతగా అందుబాటులోకి తెచ్చేందుకు,సభ్యదేశాల మధ్య రవాణాను సులభతరం చేసేందుకు కృషిచేస్తానని వెల్లడించారు.

# ఏపీలో ఇంత దుర్మార్గపు పాలన ఎన్నడూ లేదు.!

### - మాజీ సీఎం జగన్

ఆంధ్ర ప్రగతి గుంటూరు సెప్టెంబర్ 11: ఇంత దుర్మార్గ పాలన ఏపీలో ఎన్నడూ లేదని.. చంద్రబాబు సర్కార్‌పై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం? వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. అక్రమ కేసులో అరెస్టై గుంటూరు జైలులో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను వైఎస్ జగన్ పరామర్శించి ధైర్యం చెప్పారు. అన్ని విధాలా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ.. అక్రమ కేసులతో ఒక దళిత నేతను అరెస్ట్ చేశారని మండిపడ్డారు.బాబు తప్పిదాలను డైవర్ట్ చేసేందుకే అక్రమ కేసులు"చంద్రబాబు నిర్లక్ష్యంతో విజయవాడ అతలాకుతలం అయ్యింది. బాబు తప్పిదాలను డైవర్ట్ చేసేందుకే అక్రమ కేసులు. నాలుగేళ్ల క్రితం నాటి కేసును తెరపైకి తెచ్చారు.




సిట్టింగ్ సీఎంను టీడీపీ నేత దారుణంగా దూషించాడు. సీఎంగా నన్ను దూషించినా బాబులా కక్ష సాధింపునకు దిగలేదు. 41 ఏ కింద నోటీసులు ఇచ్చి కోర్టులో ప్రవేశపెట్టాం" అని వైఎస్ జగన్ గుర్తు చేశారు **మిగతాది 2లో...**


# మద్యం పాలసీపై అధ్యయనానికి కేబినెట్ సబ్ కమిటీ



ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 11: ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో, త్వరలోనే నూతన మద్యం విధానం అమల్లోకి రానుంది. పాత మద్యం పాలసీ ఈ నెలాఖరుతో ముగియనుంది.ఈ నేపథ్యంలో, నూతన మద్యం విధానంపై అధ్యయనానికి ఐదుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న మద్యం విధానంపై ఈ కేబినెట్ సబ్ కమిటీ సమీక్ష జరపనుంది. అంతేకాకుండా, తెలంగాణ, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న మద్యం విధానాలపై అధ్యయనం చేయనుంది. ఇప్పటికే అధికారులు ఆయా రాష్ట్రాల్లో పర్యటించి రూపొందించిన నివేదికను ఈ సబ్ కమిటీ పరిశీలించనుంది.నూతన మద్యం విధానంపై వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు తీసుకోనుంది. ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవు.. అయినా నెట్టుకుంటూ వస్తున్నాం, గోదావరి జిల్లాల పర్యటనలో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు గత వైసీపీ ప్రభుత్వం మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసిందని ఏపీ అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. సొంత ఆదాయం పెంచుకునేలా ఆదాయానికి గండి కొట్టేలా గత ప్రభుత్వం మద్యం పాలసీని అమలు చేసిందని మండిపడ్డారు.నాటి మద్యం పాలసీ కారణంగా ప్రజల ఆరోగ్యం నాశనమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొత్త మద్యం పాలసీ రూపకల్పనపై బుధవారం కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం జరిగిందని తెలిపారు. మంచి మద్యం పాలసీని త్వరలోనే తీసుకొస్తామని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త పాలసీని తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఆరు రాష్ట్రాల్లోని మద్యం పాలసీలను అధ్యయనం చేస్తున్నామన్నారు. తక్కువ ధరకు నాణ్యమైన మద్యం అందించేలా పాలసీ రూపొందించినున్నట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ విధానాలు, నాసిరకం మద్యం కారణంగా ఏపీలో గంజాయి వినియోగం పెరిగిందని ఆరోపించారు.

# ఏపీ బీజేపీ చీఫ్ గా నల్లారి.?

ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 11: ఏపీ బీజేపీ కొత్త చీఫ్ ఎవరు అన్న చర్చ నడుస్తోంది. ఎందుకంటే ఆ పదవిలో ప్రస్తుతం ఉన్న దగ్గుబాటి పురంధేశ్వరి పదవీ కాలం తొందరలో పూర్తి కావస్తోంది. ఆమె 2022లో ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. బీజేపీలో అధ్యక్ష పదవీ కాలం రెండేళ్ళు మాత్రమే. పైగా ఇపుడు పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు ప్రక్రియ సాగుతోంది. దీని తరువాత కొత్త అధ్యక్షుడు నియామకం ఉంటుంది అని అంటున్నారు. ఇదిలా ఉంటే ఏపీ బీజేపీ చీఫ్ గా ఎవరిని నియమిస్తారు అన్నది పాయింట్. ఉమ్మడి ఏపీ రెండుగా విభజించిన తరువాత సుదీర్ఘ కాలం కంభంపాటి హరిబాబు చీఫ్ గా వ్యవహరించారు. ఆ తరువాత మాజీ మంత్రి కన్నా లక్ష్మీ నారాయణకు చాన్స్ ఇచ్చారు. ఆయన అనంతరం సోము వీర్రాజుకు పగ్గాలు ఇచ్చారు. ఆయన నుంచి దగ్గుబాటి పురంధేశ్వరికి అవకాశం దక్కింది. ఇలా చూసుకుంటే మొత్తం నలుగురు ఏపీ బీజేపీ అధ్యక్షులుగా పనిచేస్తే ఆ నలుగురూ కోస్తాకు చెందిన వారే కావడం విశేషం. పైగా ఇద్దరు కమ్మ, ఇద్దరు కాపులకు బీజేపీ అవకాశం ఇచ్చినట్లు అయింది. అలా సామాజిక ప్రాంతీయ సమతూకం పాటించిన బీజేపీ విభజన ఏపీలో తొలిసారిగా ఒక బలమైన సామాజిక వర్గం వైసీపీకి గట్టి పట్టు ఉందని భావిస్తున్న రాయలసీమ నుంచి ఒక కీలక నేతను తెచ్చి కొత్త అధ్యక్షుడిని చేయాలని చూస్తోంది అని అంటున్నారు.



ఆయన ఎవరో కాదు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి. ఉమ్మడి ఏపీకి చివరి సీఎం గా వ్యవహరించిన నల్లారి వారు బీజేపీలో చేరగానే చాలా అవకాశాలు ఆ పార్టీ ఇచ్చింది. ఆయనను పార్టీ జాతీయ కీలక నేతగా భావిస్తోంది ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజంపేట నుంచి నల్లారి లోక్ సభకు ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు. ఆయన కనుక గెలిచి ఉంటే కచ్చితంగా కేంద్ర మంత్రి అయి ఉండేవారు.

ఇపుడు ఆయనకు మరో అవకాశంగా బీజేపీ అధ్యక్ష పదవిని ఇస్తున్నారు అని అంటున్నారు. ఉమ్మడి ఏపీలో ఇంద్రసేనారెడ్డి, జి కిషన్ రెడ్డి వంటి వారు బీజేపీ ప్రెసిడెంట్లుగా పనిచేశారు. కానీ విభజన ఏపీలో మొదటి రెడ్డిగా బీజేపీ పగ్గాలు అందుకోబోతున్నది మాత్రం నల్లారి వారే అని చెప్పాలి.

ఆయన కాంగ్రెస్ లో అనేక పదవులు చేపట్టారు, ఇపుడు ఆయనకు ఏపీ బీజేపీని లీడ్ చేసే చాన్స్ దక్కబోతోంది అని అంటున్నారు. నల్లారి ద్వారా రాయలసీమలో వైసీపీ నుంచి పెద్ద ఎత్తున చేరికలను ప్రోత్సహించాలని తద్వారా ఏపీలో బలం పుంజుకోవాలని బీజేపీ చూస్తోంది అని అంటున్నారు.

అదే సమయంలో చూస్తే టీడీపీ కూటమి ఏపీలో అధికారంలో ఉంది. టీడీపీకి కమ్మలు విధేయత చూపిస్తారు. కాపులు జనసేన వైపు ట్రావెల్ అవుతున్నారు. దాంతో బీజేపీ రెడ్డి సామాజిక వర్గం మీద గురి పెట్టిందని అందుకే బెస్ట్ చాయిస్ గా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ని ముందు పెట్టి ఏపీలో కమల కిరణాలను గట్టిగా అంతటా ప్రసరింపచేయాలని వ్యూహ రచన చేస్తోంది అని అంటున్నారు.

ఏపీలో రెడ్లు ఇపుడు ఆలోచనలో పడ్డారు అని అంటున్నారు. వైసీపీని నమ్ముకుని ఉండలేక అలాగని కాంగ్రెస్ లో చేరలేక టీడీపీలో చోటు లేక వారు ఏమి చేయాలో పాలు పోని స్థితిలో ఉన్నారని అంటున్నారు. దాంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వారిని ఆకట్టుకుంటే ఏపీలో బలమైన పార్టీగా మారేందుకు ఆస్కారం ఉంటుందని అలాగే ఒకనాటి కాంగ్రెస్ మాదిరిగా తమ పార్టీలో కూడా రెడ్లకు సముచితమైన స్థానాన్ని కల్పిస్తామని చెప్పడమే బీజేపీ ఆలోచన అని అంటున్నారు. ఇక కిరణ్ కుమార్ రెడ్డికి ఈ పదవి ఇస్తున్నారని ముందే ఆయనకు తెలుసు కాబట్టి ఇప్పటి నుంచే వైసీపీ నేతలను ఆయన ఆకట్టుకునే పనిలో పడ్డారు అని అంటున్నారు. కొంతమంది నేతలతో ఆయన మంతనాలు సాగిస్తున్నారు అని అంటున్నారు. బీజేపీలోకి వస్తే తగిన గౌరవం ఇస్తామని కూడా వైసీపీ నేతలకు కిరణ్ కుమార్ రెడ్డి చెబుతున్నారు అని అంటున్నారు. మొత్తానికి చూస్తే కిరణ్ కుమార్ రెడ్డి మీద ఎంతో ఆశతో పెద్ద బాధ్యతలనే పార్టీ పెట్టబోతోంది అని అంటున్నారు. మరి దానిని కిరణ్ కుమార్ రెడ్డి ఎంత మేరకు నెరవేరుస్తారు అన్నది చూడాల్సి ఉంది.

# మంత్రి నారా లోకేష్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 11:

ఆంధ్ర రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. విజయవాడలోని 47 వ డివిజన్ లోని బాధితుల నష్టాలు గురించి అలాగే ఆళ్లగడ్డలోని పలు రాజకీయ విషయాల గురించి చర్చించడం జరిగింది. విజయవాడలోని 47వ డివిజన్లో వరద ప్రభావం తర్వాత వరద బాధితుల కష్టాలు తీర్చేందుకు అక్కడ పర్యటించి ప్రజలకు రేషన్ పంపిణీ చేయడం జరిగిందని భూమా అఖిలప్రియ తెలిపారు. వరద వల్ల కొంతమంది తమ దుకాణాలు మరియు సామాగ్రిని కోల్పోయారని భారీ వరద నీటి కారణంగా కుటుంబాలు మరియు ఇంటి అవసరాలు / గృహపకరణాలు కోల్పోయారని, అలా నష్టపోయిన 66 మంది బాధితుల జాబిత ను ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియా అందజేసి వారికి ప్రభుత్వ తరఫునుంచి అవసరమైన సహాయం వెంటనే అందజేయవలసిందిగా తెలియజేయడం జరిగింది. వరద బాధితుల కోసం కష్టపడి వారికి అండగా ఉండి సేవలందించినందుకు భూమా అఖిల ప్రియకు నారా లోకేష్ అభినందనలు తెలియజేయడం జరిగింది. ఆళ్లగడ్డ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ను తాను ఇటీవలే తనిఖీలు చేశానని కళాశాలలో ఎటువంటి మౌలిక వసతి సదుపాయాలు లేవని కళాశాల ప్రిన్సిపల్ ఇవేవీ పట్టించుకోవడంలేదని భూమా అఖిలప్రియ నారా లోకేష్ కు వివరించడం జరిగింది. ఐటి మినిస్టర్ లోకేష్ వెంటనే సానుకూలంగా స్పందించి ఆళ్లగడ్డకు డిగ్రీ కళాశాల భవనాన్ని మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

# ఏపీలో ఇంత దుర్మార్గపు పాలన ఎన్నడూ లేదు.!

(మొదటి పేజి తరువాయి)

చంద్రబాబు తప్పుడు సాంప్రదాయానికి నాంది పలుకుతున్నావ్. మీ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదు. ఇదే తప్పుడు సాంప్రదాయం ఒక సునామీ అవుతుంది. మీ నాయకులకు ఇదే గతి పడుతుంది.. ఇదే జైల్లో ఉంటారు. రెడ్‌బుక్ పెట్టుకోవడం ఏదో ఘనకార్యం కాదు. పాలన గాలికొదిలేసి రెడ్‌బుక్‌పైనే బాబు దృష్టి పెట్టాడు. ప్రజా సమస్యలపై దృష్టి లేదు." అంటూ వైఎస్ జగన్ దుయ్యబట్టారు. చంద్రబాబు తప్పుడు పనికి 60 మంది బలి"తుపాను వస్తుందని ముందే చెప్పినా బాబు పట్టించుకోలేదు. తన ఇంటిని రక్షించుకునేందుకు విజయవాడను ముంచారు. బుడమేరు గేట్లు ఎత్తి విజయవాడను ముంచేశారు. చంద్రబాబు తప్పుడు పనికి 60 మందికిపైగా చనిపోయారు. 60 మందిని పొట్టను పెట్టుకున్న బాబుపై కేసు ఎందుకు పెట్టరు?. చంద్రబాబు బోట్ల రాజకీయం చేస్తున్నారు. బోట్లకు ఎవరి హయాంలో పర్మిషన్ వచ్చింది?. చంద్రబాబు గెలవగానే ఇదే బోట్లపై విజయోత్సవాలు చేశారు. బాబు, లోకేష్‌తో కలిసి బోటు ఓనర్ ఉషాద్రి ఫొటోలు దిగాడు. టీడీపీ హయాంలోనే ఈ బోట్లకు అనుమతి ఇచ్చారు. ఈ బోట్లన్నీ టీడీపీ నేతలకు చెందినవే. వాస్తవాలు వక్రీకరించి రాజకీయం చేస్తున్నారు. ప్రజలకు తోడుగా నిలవకుండా నేరాన్ని మాపై నెడుతున్నారు" అని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు."సూపర్ సిక్స్ హామీలు.. ఇప్పుడు మోసమని తేలాయి. రాష్ట్రంలో పాలన ఉందా?. సచివాలయ వ్యవస్థను నీర్వీర్యం చేశారు. ఇంటింటికి సేవలను నిలిపేశారు. ఈ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి సాయం లేదు. అమ్మఒడి పథకాన్ని గాలికొదిలేశారు. బడుల్లో తిండి తినలేక విద్యార్థులు ధర్నాలు చేస్తున్నారు. ఆసుపత్రుల్లో మందులు, నర్సుల కొరత ఉంది. మెడికల్ కాలేజీలను అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రజలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి" అని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.

# గత ప్రభుత్వ పాపాలే ఇప్పుడు శాపాలు

ఏలూరు ఆంధ్ర ప్రగతి

గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలు మనకు ఇప్పుడు శాపాలుగా మారాయని సీఎం చంద్రబాబు ఆరోపించారు. బుడమేరు పట్ల నాటి సర్కారు వహించిన నిర్లక్ష్య ధోరణి విజయవాడకు ముప్పుగా పరిణమించిందని చెప్పారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా బుడమేరు పూడిక తీయలేదని, గండ్లు పూడ్చలేదని విమర్శించారు. దీంతో భారీ వర్షాలకు విజయవాడను కనీవినీ ఎరగని వరద ముంచెత్తిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. %ఏలూరు జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను నేడు ఆయన పరిశీలించారు. కొల్లేరు పరివాహక ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో తమ్మిలేరు వరద ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం కొల్లేరు, ఉప్పుటేరు, తమ్మిలేరు వరదలపై అధికారులతో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు..

ఆ తర్వాత ఆయన సీఆర్‌రెడ్డి కాలేజ్ ఆడిటోరియంలో వరదలకు నష్టపోయిన రైతులు, వరద బాధితులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీలోపు నష్ట పరిహారంపై నిర్ణయం తీసుకుంటామని, వరికి మాత్రం ఎకరానికి రూ. 10 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మాణంపై సీరియస్‌గా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు తెలుగుదేశం హయాంలో 72 శాతం పూర్తిచేసామని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ పోలవరాన్ని ముంచేసారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఇప్పుడు పోలవరం పూర్తిచేయాలనే ఉద్దేశ్యంతో కేంద్రంతో మాట్లాడి రూ. 12 వేల కోట్లు తీసుకువచ్చామన్నారు. త్వరలోనే పోలవరం పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. వరదలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు ముందుగా తీసుకుంటామని, వరదల వలన సాగునీటి సంఘాల ఎన్నికలు ఆలస్యం అయ్యాయని, త్వరలోనే అవి వస్తాయని తెలిపారు. శనివారపుపేట కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నానని, పెదపాడు మండలంలో లోయేరు వాగు మరమత్తులు చేపడతామని చెప్పారు. వరదల వలన నష్టపోయిన అందరినీ ఆదుకుంటామని స్పష్టం చేశారు. తాను, తన మిత్రుడు పవన్ కళ్యాణ్, బీజేపీలు (కూటమి ప్రభుత్వం) సుపరిపాలన అందిస్తామని, కౌలు రైతుల ఖాతాల్లోకి నేరు ఇన్ పుట్ సబ్సీడీ వేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

గతంలో బుడమేరుకు గండ్లు పడితే వైసీపీ ప్రభుత్వం పూడ్చలేదని విమర్శించారు. బుడమేరు వాగు పరిధిలో గత ప్రభుత్వం అక్రమార్కులను ప్రోత్సహించిందని, అక్రమ కట్టడాలకు తప్పుడు దారిలో అనుమతులిచ్చిందని వివరించారు. కుండపోత వర్షాలు, వరదలకు వాతావరణ మార్పులు కారణమని చెప్పారు. అయితే, ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వరదల ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు.

ఎన్నికల్లో ఓడించిన ప్రజలపై కక్ష తీర్చుకునే వైపుగా వైసీపీ నాయకులు పోతున్నారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. కృష్ణా నదిలో వదిలిపెట్టిన నాలుగు బోట్లు వైసీపీ వాళ్లవేనని చెప్పారు. ప్రకాశం బ్యారేజీని ధ్వంసం చేయడానికి ఆ పార్టీ వాళ్లు ఉద్దేశపూర్వకంగానే వాటిని నదిలో వదిలిపెట్టారని వివరించారు. ఆ బోట్లపై వైసీపీ రంగు ఉందన్న విషయం గుర్తుచేశారు. ఒకదానిని మరొకటి చైన్లతో కట్టి నదిలో వదిలి పెట్టడంతో అవి బ్యారేజీ గోడలను ఢీ కొట్టాయని, ఇప్పటికీ వాటిని బయటకు తీయడానికి అధికారులు శ్రమిస్తూనే ఉన్నారని చంద్రబాబు తెలిపారు.

ఆ బోట్లను ఇసుక అక్రమ రవాణాకు ఉపయోగించే వారని ఆరోపించారు. వైసీపీ లీడర్ జగన్ ఇప్పుడు మాట్లాడుతూ.. ఆ బోట్లు టీడీపీ వాళ్లవేనని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. ప్రకాశం బ్యారేజీని కూల్చాలని కుట్ర చేశారని, దీని వెనక రాజకీయ లింకులు లేకుంటే ఒక్క నిమిషంలో నిందితులను ఏం చేయాలో అది చేసే వాడినని వివరించారు. రౌడీలు, గూండాలను తాను ఎన్నడూ సహించలేదని, సామాన్యులకు ఇబ్బంది కలిగించే వారిపట్ల తానెప్పుడూ కఠిన వైఖరినే అవలంబించానని చంద్రబాబు గుర్తుచేశారు.

# రాష్ట్రపతి పాలన తీసుకొచ్చే కుట్ర జరుగుతోంది.!



ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 11:

ఇటీవల ఏపీలో కురిసిన భారీ వర్షాలు వరదల సమయంలో విజయవాడ ప్రకాశం బ్యారేజీ గేట్లను బోట్లు ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ విషయంలో వైసీపీ, టీడీపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రకాశం బ్యారేజీ కౌంటర్ వెయిట్లను ఢీకొట్టిన బోట్లు వైసీపీ నేతలకు చెందినవేనని మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన బుధవారం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి రాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ..విపత్తుసమయంలో అందరూ సహాయం చేస్తుంటే వైసీపీ మాత్రం రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. బ్యారేజీని కూల్చివేసి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన తీసుకురావాలనే కుట్రతోనే బోట్లను ఢీకొట్టేలా చేశారన్నారు. ప్రజాప్రతినిధిగా జగన్ వ్యవహరించట్లేదని దుయ్యబట్టారు. ప్రజలు కష్టాల్లో ఉంటే జగన్‌కు రాజకీయాలు కావాల్సి వచ్చిందా స్వాతంత్ర్య సమరయోధుడు జైల్లో ఉన్నట్లు నందిగం సురేష్‌ను పరామర్శించారని ఎద్దేవా చేశారు. మాజీ ఎంపీ కోసం జైలుకు వెళ్లి పరామర్శించిన జగన్ వరదలతో కష్టాలు అనుభవిస్తున్న ప్రజల బాధలు పట్టావా? అని మంత్రి రాం ప్రసాద్ రెడ్డి ఫైరయ్యారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు రంగం సిద్ధం.!

ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 11:

రాష్ట్రానికి తలమానికంలా ఉంటూ వస్తోన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఇప్పటికే ఈ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ వ్యవహారం రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా కూడా చర్చనీయాంశమైన ప్రస్తుత పరిస్థితుల్లో- కేంద్రం మరో అడుగు ముందుకు వేసింది. ప్రైవేటీకరణకు రంగం సిద్ధం చేసింది. విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని వందశాతం మేర ప్రైవేటీకరించి తీరుతామంటూ గతంలో కేంద్ర ప్రభుత్వం పలుమార్లు స్పష్టం చేసింది. దాన్ని విక్రయించే దిశగా అడుగులు వేసింది. ఈ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి విశాఖపట్నం సహా రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల ఇదివరకు రాజకీయ పార్టీలు నిర్వహించిన ప్రదర్శనలను గానీ, ఆందోళనలను గానీ కేంద్ర ప్రభుత్వం బేఖాతర్ చేసింది.

కేబినెట్ కమిటీ నివేదిక ఇచ్చిన అనంతరం- మరిన్ని కీలక నిర్ణయాలను తీసుకుంది కేంద్ర ప్రభుత్వం. విశాఖపట్నం స్టీల్ ఫ్యాక్టరీలో సబ్సిడయిరీస్ లేదా జాయింట్ వెంచర్స్ ఉంటే వాటిని కూడా వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేసింది. 2003లో ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ బిడ్స్‌ను సైతం ఆహ్వానించింది కేంద్ర ప్రభుత్వం. ప్రైవేటీకరణ చర్యలను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విజయవంతంగా అడ్డుకుంది. ఫలితంగా ప్రైవేటీకరణ ముందుకు సాగలేదు.

ఇప్పుడు ఏపీలో ప్రభుత్వం మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సారథ్యంలో రాష్ట్రంలో తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ నేపథ్యంలోఇక ప్రైవేటీకరణ చర్యలను కేంద్ర ప్రభుత్వం మరింత ముమ్మరం చేసింది. దూకుడు పెంచింది. ఎట్టి పరిస్థితుల్లోనూ తాము విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు చేతుల్లోకి వెళ్లనివ్వబోమంటూ గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలను ఆందోళనకారులు గుర్తు చేశారు. ఇప్పుడు తాజాగా జరుగుతున్న ప్రైవేటీకరణ చర్యలపై సమాధానం చెప్పాలంటూ పట్టుబట్టారు. మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు.

వారి ఆందోళన నేపథ్యంలో విశాఖపట్నంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. సీఐటీయు, ఇతర కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు భారీ సంఖ్యలో రోడ్లపై బైఠాయించడం వల్ల ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు వారిని నచ్చజెప్పడానికి ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. కొన్ని గంటల పాటు రాస్తారోకో కొనసాగింది.

# ఏలేరు వరద వృద్ధితి పై సహాయ చర్యలు చేపట్టాలి.

(మొదటి పేజి తరువాయి)

గొల్లప్రోలు దగ్గర జాతీయ రహదారిపై ప్రవాహం ఎక్కువగా ఉన్నందున వాహనాలను దారి మళ్లించినట్లు తెలిపారు. వరద పీడిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు అవసరమైన పడవలు, సహాయక బృందాలు పూర్తి స్థాయిలో పని చేస్తున్నాయని వివరించారు. ఏలేరుకి వరద ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోందని కలెక్టర్ వివరించారు. ఈ రోజు ఉదయం 8 గం కి 12,567 క్యూసెక్కుల ఇన్ఫ్లోకి వచ్చేసిందని తెలిపారు. జలాశయం పూర్తి సామర్థ్యం 24.11 టి.ఎం.సి. కాగా ప్రస్తుతం 22.16 టి.ఎం.సి. ఉందని వివరించారు. నాలుగు గేట్లు ఎత్తినట్లు చెప్పారు. పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేస్తూ ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్.డి.ఆర్.ఎఫ్. దళాలతోపాటు ఆర్మీ బృందాల సేవలను కూడా వినియోగించుకొని ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా నివాస సముదాయాలను వరద చుట్టుముట్టిన చోట్ల అక్కడి ప్రజలకు తగిన ఆహారం, నీరు, పాలు అందించాలని స్పష్టం చేశారు. ఏలేరు వరదతో పంటలు కోల్పోయిన రైతులతో ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం మాట్లాడుతూ ధైర్యం చెప్పాలన్నారు.

# ఏపీ పోలీసు శాఖకు కేంద్ర పురస్కారం.!

## -నేరాల నియంత్రణలో అత్యుత్తమ పనీతీరు.

## -అమిత్ షా చేతుల మీదుగా పురస్కారం ప్రదానం.



ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ సెప్టెంబర్ 11:

ఆంధ్రప్రదేశ్ పోలీస్ విభాగానికి కేంద్ర పురస్కారం లభించింది. ఆన్‌లైన్‌లో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల నియంత్రణలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు ఏపీ పోలీసు విభాగానికి కేంద్ర ప్రభుత్వం పురస్కారాన్ని ప్రకటించింది. ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమం లో కేంద్రహోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఏపీ సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్, సీఐడీ మహిళా సంరక్షణ విభాగం ఎస్పీ కేజీవి సరిత ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఇండియన్ సైబర్ కో ఆర్డినేషన్ సెంటర్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సర్టిఫికెట్ ఆఫ్ రికగ్నిషన్'ను అందజేశారు.

# ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ ప్లాంట్ నిర్మాణం ఆపాలి

**-ఉయ్యాలవాడ గ్రామంలో గ్రీన్ కో సంస్థ సోలార్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపే వరకు ఈ ఉద్యమం ఆగదు.**

**-ఏపీ రైతు సంఘం భూ నిర్వాసితుల కమిటీ.**



**ఆంధ్ర ప్రగతి ఓర్వకల్లు సెప్టెంబర్ 11:** రైతు సంఘం భూ నిర్వాసితుల కమిటీల ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ గ్రామంలో కరపత్రాల పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న రైతు సంఘం మండల అధ్యక్షులు ఎస్ మధుసూదన్ మాసుం భాష భూనిర్వాసితుల కమిటీ నాయకులు మహబూబ్ బాషా రైతులు పాల్గొన్నారు వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉయ్యాలవాడ గ్రామంలో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేపట్టమని గ్రామస్తులకు రైతులకు హామీ ఇచ్చారని కానీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పెద్దలు అధికారులు సోలార్ ప్రాజెక్టు నిర్మాణం కొరకు ప్రయత్నాలు చేయడం సరైనది కాదని ఆవేదన వ్యక్తం చేశారు ఉయ్యాలవాడ గ్రామంలో రైతుల భూములు సారావంతమైనవని బోర్లు వేసుకుని అనేకమంది రైతులు రెండు కార్ల పంటలు పండిస్తున్నారని తోటలు కూడా ఉన్నాయని అన్నారు ఆ భూములు తీసుకోవడం వల్ల రైతులు నిర్వాసితులౌతారని వారితో పాటు గొర్ల కాపర్లు పసువుల కాపర్లు నిర్వాసితులవుతారని అన్నారు ఎకరా రెండెకరాల భూములు ఉన్నటువంటి పేదలు వెనకబడిన తరగతుల రైతులు ఈ భూముల్లో అత్యధికం ఉన్నారని వారి జీవనాధారం దెబ్బతింటుందని కనుక తక్షణమే కూటమి ప్రభుత్వం ఉన్నతాధికారులు ఉయ్యాలవాడ గ్రామ రైతులు ప్రజల డిమాండ్ మేరకు సోలార్ ప్రాజెక్టును వెనక్కు తీసుకుని వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రైతులకు అండగా ప్రజాసంఘాలను కూడగట్టి ఆందోళన చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు రామకృష్ణ సుబ్బరాయుడు హుస్సేన్ వెంకటరమణ తిరుపతయ్య శ్రీరాములు వేణుగోపాల్ బ్రహ్మాచారి మధు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే భూమా




ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 11:
వినాయక చవితి సందర్భంగా నంద్యాల పట్టణ శ్రమాధానం బ్రిడ్జి ఏరియా లో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించి మరియు 23 వార్డ్ ఏకలవ్య నగర్ నందు ఏకలవ్య నగర్ యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని దర్శించుకొని అనంతరం భక్తులకు,వార్డ్ ప్రజలకి ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని నంద్యాల నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు భూమా బ్రహ్మానంద రెడ్డిప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 23 వార్డ్ టీడీపీ ఇంచార్జి అమిదేల చందు,క్లస్టర్ ఇంచార్జి మంచాల విజయ భాస్కర్ రెడ్డి,పాపోడు,మధు కృష్ణ , సుబ్బయ్య,మధు,వెంకట కృష్ణుడు,కిట్టు,24 వార్డ్ టీడీపీ ఇంచార్జి చలపతి,అరవేటి రవి కుమార్,అబ్దుల్లా.వెంకటేశ్వర్లు, ఎం .వెంకటేశ్వర్లు,రామ సుబ్బయ్య,శ్రీనాథ్,నబీ రసూల్, మారం వినయ్ కుమార్,వి .విశ్వేశ్వర రెడ్డి,లక్ష్మయ్య, వెంకట నాయుడు,కమల్ భాష, ఖాదర్ మరియు వార్డ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను గడువులోగా పూర్తి చేయండి

**-అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 11: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీవోలు, ఎపిడిలు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఉపాధి హామీ పథకం కింద నిర్ధేశించిన లేబర్ బడ్జెట్, 100 రోజుల పనిదినాల కల్పన, హార్టికల్చర్, అవెన్యూ ప్లాంటేషన్ పనులు, సంస్థాగత ప్లాంటేషన్ పనులు, బ్లాక్ ప్లాంటేషన్ పనులు, ఫారం పాండ్స్, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనులు, పశుసంపద షెడ్లు, ట్రెంచ్ పనుల ప్రగతి లక్ష్యాలపై డ్వామా పిడి రామచంద్రారెడ్డితో కలసి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లస్టర్ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనులను గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవోలు, ఎపిడిలు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. లేబర్ బడ్జెట్ మొబలైజేషన్ లో జూపాడుబంగ్లా, కొత్తపల్లి, మిడుతూరు, పాములపాడు తదితర మండలాలు లక్ష్యసాధనలో వెనుకబడి వున్నాయని మూడు రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్లాంటేషన్ కు సంబంధించి మిడుతూరు, ప్యాపిలి, డోన్, బేతంచర్లలో లక్ష్యాన్ని చేరుకోలేదని ఈ వారంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫారం పాండ్ల త్రవ్వకంలో కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ తదితర మండలాల్లో పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి ఎపీడీలు ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తూ పనుల వేగవంతానికి కృషి చేయాలన్నారు.

## మొదటి వినాయకుని నిమజ్జనం చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 11:** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నంద్యాల పట్టణంలో పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలను ప్రజలు ఏర్పాటు చేశారు. బుధవారం వినాయక పండగ ఐదవ రోజు కావడంతో నిమజ్జనానికి సన్నద్ధమయ్యారు. ఈ సందర్భంగా నంద్యాల స్థానిక చిన్న చెరువు నందు మొదటి విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ నిమర్జనం చేశారు.

ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ డప్పులు, మేళ తాళాలు, రంగులు, బాణాసంచా, గణపతి పప్పా మోరియా అంటూ నిమజ్జనానికి పయనమయ్యారని, నంద్యాల చిన్న చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనానికి పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారన్నారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు చెరువు కట్ట వెంబడి బారికేడ్లు ఏర్పాటు చేశారని . వినాయక విగ్రహాలను ప్రజలు వాహనాలలో చెరువు కట్ట వద్దకు తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ భాషా, మున్సిపల్ చైర్ పర్సన్ మాబునిషా, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామచంద్ర రావు, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి రామకృష్ణారెడ్డి,గణేష్ కేంద్ర కమిటీ సభ్యులు గంగిశెట్టి విజయ్ కుమార్ కౌన్సిలర్లు గంగిశెట్టి శ్రీధర్, శ్యామ్ సుందర్ లాల్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చెలం బాబు నిమ్మకాయల సుధాకర్ మేడ మురళి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి



ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 11: జేఏసీ కన్వీనర్ గన్ని అబ్దుల్ కరీం మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా విద్యా హక్కు చట్టం అమలు జరగడం లేదని పేర్కొన్నారు.గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 24ను యధావిధిగా కొనసాగించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డికి వినతి పత్రం అందించడం జరిగిందన్నారు.జేఏసీ కార్యవర్గ సభ్యులు షేక్.రియాజ్ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం అమలు చేయకుండా కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విద్యా శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని.నంద్యాల జిల్లాలో ఎక్కడ ఫీజు నియంత్రణ చట్టం 25 శాతం ఉచిత సీట్లు చట్టం అమలు కావడం లేదు గత విద్యా సంవత్సరంలో విద్యా హక్కు చట్టం కింద చదువుతున్న విద్యార్థులకు వేల రూపాయలు ఫీజులు కట్టాలని పాఠశాలల యాజమాన్యాలు వేధింపులకు గురి చేస్తున్నారని దీనిపై వెంటనే చర్యలు తీసుకుని తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యా అధికారి సానుకూలంగా స్పందిస్తూ ఏ పాఠశాల యాజమాన్యం అయిన విద్యా హక్కు చట్టం కింద చదువుతున్న విద్యార్థులకు ఫీజులు కట్టాలని వేధింపులకు గురి చేస్తే తల్లిదండ్రులు నేరుగా విద్యా శాఖకు ఫిర్యాదు చేయగలరని తెలిపారు.


## వరద బాదితులకు సిపిఐ నంద్యాల జిల్లా నుండి నిత్యావసర వస్తువుల సేకరణ

**-జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 11:** ఈ నెల 1వ తేది కురిసిన భారీ వర్షానికి విజయవాడ నగర ప్రజలు నిరాశ్రయులయ్యారు. వారిని ఆదుకునేందుకు నంద్యాల జిల్లా ప్రజలు, సిపిఐ పార్టి ఆద్వర్యంలో నిత్యావసర వస్తువుల సేకరణకు సహకరించారు. దాదాపు 100 ప్యాకేట్ల బియ్యం, కందిపప్పు, బట్టలు, చింతపండు, వంట నూనెలతో అనేక రకాల సరుకులు సేకరించి విద్యార్థి, యువజన, రైతు, ప్రజా నాట్యమండలి కళాకారులు నడుం బిగించి విజయవాడ వరద బాధితులకు తరలించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబాఫక్రుద్దీన్ జిల్లా అంతా సమన్వయం చేశారు. నంద్యాలలో కే.ప్రసాద్, నాగరాముడు, సోమన్న, శ్రీనివాసులు,ధనుంజయ, 5 ప్యాకేట్స్ బియ్యం, 45 కేజీ వంటనూనె, 30 టి షర్ట్స్, ప్రజా నాట్యమండలి జిల్లా సమితి ఆద్వర్యంలో జిల్లా కార్యదర్శి శివయ్య, గోకారి, రమేష్ 60 ప్యాకేట్స్ బియ్యం, బట్టలు, బెడ్ షీట్స్, డోన్ లో పి. సుంకయ్య, రాధాకృష్ణ, నారయణ, షమీమ్ బేగం, లక్ష్మీదేవి, 6 ప్యాకేట్స్ బియ్యం, రూ.8,500/–లు నగదు, ఆత్మకూరులో ప్రతాప్, వెంకటశివుడు, చాంద్ బాష, స్వాతి, ముర్తుజాబి 10 ప్యాకేట్స్ బియ్యం, బెడ్ షీట్స్, రుద్రవరంలో కే.భాస్కర్, బాల నరసింహుడు, వెంకటేశ్వర్లు, రామచంద్రుడు, 15 ప్యాకేట్స్ బియ్యం, మహానందిలో సామేల్, తుపాకుల వెంకటేశ్వర్లు, నరసింహ 2 ప్యాకేట్స్ బియ్యం, రూ.1,300/– లు, గోస్పాడులో హరినాథ్, జిలానీ బాష, లక్ష్మీదేవి 2 ప్యాకేట్స్ బియ్యం, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, జిల్లా నాయకత్వంబీ సూర్య ప్రతాప్, చిన్న విజయ్, రంగస్వామి, దివాకర్, శశి, మనోజ్ ల నాయకత్వం 600 వాటర్ బాటిల్స్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకత్వంబీ పి.వెంకటేష్ నాయకత్వంలో రూ.8,000/లు నిధుల సేకరణ, నందికొట్కూర్ వి.రఘురాం మూర్తి, రతిత నాయకత్వంలో రూ.4,000/లు నిధుల సేకరణ చేశారు.

## ఇస్కాన్ ఆధ్వర్యంలోఅంగరంగ వైభవంగా రాధాష్టమి వేడుకలు.



ఆంధ్ర ప్రగతి రుద్రవరం సెప్టెంబర్ 11:మండలంలోని హరినగరం సమీపంలో ఉన్న ఇస్కాన్ అహోబిలంలో బుధవారం అంగరంగ వైభవంగా రాధాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ అహోబిలం ఇంచార్జ్ చంద్రకేశవ దాస ప్రభురాధా రాణి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా రాధా రాణి గురించి ఉపన్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈరోజు ఉదయాన్నే మంగళహారతి దర్శన హారతి స్పెషల్ అలంకరణ రాధా రాణి కి 10 రకాల పుష్పాభిషేకం మరియు శంకాభిషేకం 108 రకాల మహా నైవేద్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తధానంతరం వచ్చినటువంటి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

## 14. 52 లక్షల ఎరువుల అమ్మకాలు నిలిపివేత.



ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 11: 14. 52 లక్షల ఎరువుల అమ్మకాలను నిలిపివేసినట్లు నంద్యాల రూరల్ ఏ డి ఏ రాజశేఖర్ బుధవారం పేర్కొన్నారు. మండలంలోని గాజులపల్లె గ్రామంలో ఉన్నటువంటి దీప్తి మరియు గఫారియా పెస్టిసైడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపుల్లో 47. 8 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసి ఎరువులు అమ్మకాలు నిలిపివేసినట్లు తెలిపారు. స్టాకు రిజిస్టర్ మరియు ఈ పాస్ మిషన్ ద్వారా లెక్కల్లో తేడా ఉన్నట్లు ఏడిఏ తెలిపారు. ఎరువులు అమ్మకాలకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేవని చట్ట విరుద్ధంగా చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని షాపు యజమానులను హెచ్చరించారు. షాపుల్లో ధరల పట్టికలను మరియు స్టాకు వివరాలను ప్రతిరోజు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మహానంది మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఆళ్లగడ్డలో ఘనంగా గణనాధులకు వీడ్కోలు



ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ సెప్టెంబర్ 11: ఆళ్లగడ్డ పట్టణంలో బుధవారం రాత్రి గణేష్ నిమజ్జోన మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఐదు రోజుల పాటు పూజలు అందుకున్న 70 మందికి పైగా వినాయకులు అత్యంత కోలాహలం, శోభాయాత్ర, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ వకులా నదిలో నిమజ్జనం గావించారు. ముందుగా సాయంత్రం పట్టణంలోని విగ్రహాలన్ని గణేష్ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలికి ఊరేగింపుగా చేరుకున్నాయి. అనంతరం అక్కడినుండి పడకండ్ల సమీపంలోని వక్కిలేరు ( వకులా నది) ఒడ్డుకు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రేన్ల సహాయంతో మున్సిపల్ సిబ్బంది గణేష్ కమిటీ సమన్వయంతో విగ్రహాల నిమజ్జనం జరిగింది. తెల్లవారుజాము వరకు నిమజ్జనోత్సవం జరగనున్నట్లు గణేష్ కేంద్ర కమిటీ సభ్యులు తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో గణేష్ శోభాయాత్ర సందర్భంగా ప్రత్యేక వేదికను కేంద్ర కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గణేష్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్ మాట్లాడుతూ గత ఏడాదికన్నా ఈ ఏడాది మరింత కట్టుదిట్టంగా ఉత్సవాలు నిర్వహించడం జరిగిందని ఈ ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి పోలీస్ శాఖ సిబ్బంది, మున్సిపల్ , ఆరోగ్యశాఖ,రెవెన్యూ అధికారులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి శాలలో ఏర్పాటుచేసిన వరసిద్ధి వినాయక స్వామికి నైవేద్యంగా సమర్పించిన లడ్డు వేలం పాటలను వాసవి సేవాదళ్ సభ్యులు నిర్వహించారు. ఈ వేలం పాటలలో డిగ్రీ కళాశాల లెక్చరర్ మధు శేఖర్ రు.15 వేలకు అత్యధికంగా వేలంపాడి లడ్డూను దక్కించుకున్నారు.

ఆళ్లగడ్డ పట్టణంలో బుధవారం రాత్రి జరిగిన గణేష్ నిమజ్జోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆళ్లగడ్డ డిఎస్పి రవికుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సబ్ డివిజన్ పరిధిలోని కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు, సిరివెళ్ల సిఐ వంశీధర్, రూరల్ సీఐ కంబగిరి రాముడు, టౌన్ సీఐ చిరంజీవి, ఎస్సైలు పోలీస్ సిబ్బంది తో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మండల తహసిల్దార్ జ్యోతి రత్నకుమారి, మున్సిపల్ ఏఈ సురేంద్ర నాథ్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది బి నీలకంఠేశ్వరం, మధు మురళీధర్, విద్యుత్ శాఖ ఏడి ఈ రవికాంత్ చౌదరి, త్రినేత్ర మోహన్ రెడ్డి,గణేష్ కేంద్ర కమిటీ సభ్యులు గ్యాస్ పుల్లయ్య, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు, ఆర్ఎస్ఎస్ ప్రముఖ చల్లు చలమల రామకృష్ణ, సుధాకర్ రావు, అపుస్మ నంద్యాల డివిజన్ ప్రెసిడెంట్ అమీర్ భాష మున్సిపల్ రెవెన్యూ ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం.




ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 11: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత తెలిపారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ రవణమ్మ ఆద్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే ఎలాంటి రోగాలు దరిచేరవని,ఆరోగ్యంగా ఉంటారన్నారు.పౌష్టికాహారం తినడంవల్ల రక్తహీనత దరిచేరదన్నారు.బాల్యవివాహాల వల్ల అమ్మాయి, అబ్బాయి జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.మహిళలు లేనిదే మానవ సృష్టి లేదని, మహిళలు లేనిది ఒక్క నిమిషం గడవదని, తల్లిగా, చెల్లిగా, భార్యగా అనేక పాత్రలు సమరత్థివంతంగా పోషిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు లక్ష్మీనారాయణమ్మ, కొండమ్మ, మహేశ్వరి, మరియమ్మ, షాహీన్, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కౌలుకు తీసుకున్న రైతులకు వెంటనే కౌలు కార్డులు ఇప్పించాలి



ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 11: కౌలుకు తీసుకున్న రైతులకు వెంటనే కౌలు కార్డులు ఇప్పించాలని నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు డి. రాజశేఖర్ అన్నారు.బుధవారం మహానంది మండలం సీతారామపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఆయన మండలంలోని గ్రామ వ్యవసాయ సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ సిబ్బంది ఈనెల 15వ తేదీ లోగా తప్పనిసరిగా, ఈ పంట నమోదు, రైతు ఈ కేవైసీ పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది.పంట నమోదు చేసినప్పుడు, ప్రతి ఒక్క ఎకరాకు తప్పకుండా, పంట నమోదు చేయాలని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. యూరియా ఎరువులు, ఇతర ఎరువుల కొరకు రైతు సేవా కేంద్రం సిబ్బంది వెంటనే,మార్క్ ఫెడ్ కు ప్రతిపాదనలు పంపాలని,యూరియా , డిఎపి ఎరువుల కొరత లేదని రైతులకు తెలియజేశారు.కావలసిన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.అనంతరం రైతు భరోసా కేంద్రాలలో యూరియా, డి ఏ పి నిలువల గురించి తెలుసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.నాగేశ్వర రెడ్డి, వివిధ గ్రామాల రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# కొల్లేరును క్లీన్ చేయడం సాధ్యమేనా..?

## కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద సవాల్..!

ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 11: విజయవాడ వరదలు, కొల్లేరు ఉగ్రరూపం చూసిన తర్వాత ప్రక్షాళనపై ప్రభుత్వం ముందడుగు వేయాలని భావిస్తోంది. ఐతే తలాపాపం తిలా పిడికడు అన్నట్లు కొల్లేరును కొల్లగొట్టడంలో అన్నిపార్టీల వారి పాత్ర ఉందనే ఆరోపణలు ఉన్నాయి. దేశంలో అతిపెద్ద మంచి నీటి సరస్సు కొల్లేరు. ఈ ప్రాంత ప్రజలకు ప్రకృతి ప్రసాదించిన వరం కొల్లేరు. లక్షల మందికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న కొల్లేరుకు ఆక్రమణలే పెద్ద శాపం. ఈ ఆక్రమణలను తొలగించి కొల్లేరును ప్రక్షాళించాలని ప్రతి ప్రభుత్వం చెప్పేమాట%ొ% ఇప్పుడు కూడా విజయవాడ వరద ముంపునకు కొల్లేరు కారణమని.. ప్రజల ప్రాణాల కోసం కొల్లేరును క్లీన్ చేస్తామంటున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. కానీ, వేల ఎకరాల కొల్లేరు భూములను ఆక్రమించిన బడాబాబులను కదపడం కుదిరే పనేనా? ఇప్పుడే కాదు చంద్రబాబు తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పుడు కూడా ఇదే మాట అన్నారు. ఆయన తర్వాత రాజశేఖర్‌రెడ్డి కొల్లేరుపై ఉక్కుపాదం మోపాలనుకున్నారు. రోజులు మారాయేగానీ కొల్లేరును ఎవరూ కాపాడలేకపోయారు. మరి ఇప్పుడు

**ఆపరేషన్ కొల్లేరు చంద్రబాబు ప్రభుత్వానికి పెద్ద సవాల్..**

ఆపరేషన్ కొల్లేరు చంద్రబాబు ప్రభుత్వానికి పెద్ద సవాల్. విజయవాడ ముంపునకు ప్రధాన కారణమైన బుడమేరు, కొల్లేరు ఆక్రమణలను తొలగించాలని నిర్ణయించారు సీఎం చంద్రబాబు. ఆయన అభిప్రాయంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఏకీభవిస్తున్నారు. భవిష్యత్‌లో వచ్చే విపత్తుల నుంచి విజయవాడ నగరాన్ని కాపాడాలంటే కొల్లేరును క్లీన్ చేయాలనేది చంద్రబాబు ఆలోచన. సీఎం ఆలోచనలను వంద శాతం సపోర్ట్ చేయాల్సిందే%ొ% కానీ, కొల్లేరు సరస్సు%ొ% అక్కడ జరిగే దందాలు, ఇతర వ్యవహారాలు తెలిసిన వారు కొల్లేరు ప్రక్షాళన సాధ్యమయ్యే పనేనా అని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.



**ఒకప్పుడు జీననాధారం లేక కొల్లేరు వాసుల వలసలు..**

సుమారు రెండు లక్షల 22 వేల ఎకరాల్లో విస్తరించిన కొల్లేరు సరస్సు%ొ% ఆక్రమణలతో బక్క చిక్కిపోతోందనేది జగమెరిగిన సత్యం. 12 మండలాల్లో 120కి పైగా గ్రామాల వారికి కొల్లేరే జీవనాధారం. ఒకప్పుడు కొల్లేరులో పర్యావరణ చట్టాలు పకడ్బందీగా అమలు చేసే కాలంలో ఇక్కడ బతకడం దుర్భరంగా ఉండేదని గుర్తు చేస్తున్నారు పర్యావరణ వేత్తలు. సరైన జీననాధారం లేక కొల్లేరు వాసులు ఇతర ప్రాంతాలకు వలస పోయేవారట. కానీ, 1970 ప్రాంతంలో అప్పటి ప్రభుత్వం కొల్లేరులో చేపలు, రొయ్యల పెంపకానికి అనుమతి ఇవ్వడంతో కొల్లేరు దశ తిరిగిపోయింది.

**వలస పోయిన కొల్లేరు వాసులు..**

ఇతర ప్రాంతాల వారికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారు. ఒకప్పుడు ఆక్వా పరిశ్రమ లక్షల రూపాయల పంట పండించేది. క్రమంగా ఆక్వా నష్టాల్లో కూరుకుపోయినా%ొ% చేపల పెంపకం ద్వారా కొల్లేరు వాసులు రెండు చేతులా సంపాదిస్తున్నారు. కొల్లేరు పరివాహ ప్రాంత వాసుల అంతా సొసైటీలుగా ఏర్పడి చేపల వేట ద్వారా డబ్బు సంపాదించగా, కాస్త అంగ అర్థ బలాలు ఉన్నవారు, రాజకీయ నాయకులు కొల్లేరును కొల్లగొట్టి.. అక్రమంగా చెరువులు తవ్వించి దోచుకుంటున్నారు. ఇలా అనుమతులు లేకుండా వెలిసిన చెరువులతో కొల్లేరు నిండిపోయింది. రెండు లక్షల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉండే కొల్లేరు సరస్సు 70 వేల ఎకరాలకు తగ్గిపోయింది.

**కొల్లేరు క్లీన్ చేసేందుకు గతంలో చంద్రబాబు, వైఎస్ఆర్ సంకల్పం..**

ఈ పరిస్థితుల్లో కొల్లేరును పరిరక్షించాలని గత ప్రభుత్వాలు యజ్ఞాలు చేశాయి. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో 1999లో కొల్లేరు ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేకంగా జీవో జారీ చేశారు. కానీ, వివిధ కారణాలతో ఆ జీవో ఆచరణకు నోచుకోలేదు. అనంతరం గద్దెనెక్కిన దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2006లో మరో జీవో జారీ చేశారు. కొన్ని చెరువులను బ్లాస్టింగ్ చేశారు. అయితే ఆక్రమణదారులు సుప్రీంకోర్టుకు వెళ్లి ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకున్నారు. ఆ తర్వాత కొల్లేరు ఆక్రమణలు యథేచ్ఛగా సాగిపోయాయి. ఇక గత ప్రభుత్వం కూడా కొల్లేరులో కొందరికి పట్టాలు పంపిణీ చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు వరదలు కొల్లేరుపై ఫోకస్ పెంచేలా చేస్తున్నాయి. దీంతో కొల్లేరులో ఆక్రమణల తొలగింపుపై మళ్లీ ప్రకటనలు చేస్తున్నారు సీఎం చంద్రబాబు.

**కోట్ల రూపాయలు తెచ్చిపెట్టే కొల్లేరును ఖాళీ చేయడానికి అంగీకరిస్తారా?**

విజయవాడ వరదలు, కొల్లేరు ఉగ్రరూపం చూసిన తర్వాత ప్రక్షాళనపై ప్రభుత్వం ముందడుగు వేయాలని భావిస్తోంది. ఐతే తలాపాపం తిలా పిడికడు అన్నట్లు కొల్లేరును కొల్లగొట్టడంలో అన్నిపార్టీల వారి పాత్ర ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ ప్రజాప్రతినిధులు, మాజీలు అంతా కొల్లరు దందాలో పాత్రధారులు, సూత్రధారులే అంటున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు దండుకోవడంలో ముందుంటారని చెబుతున్నారు. అధికారం చేతులు మారగానే పాత్రధారులు మారతారని చెబుతున్నారు. నేనే రాజు%ొ% నేనే మంత్రి అన్నట్లు కొల్లేరు ప్రాంత ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తుంటారు. కోట్ల రూపాయలు తెచ్చిపెట్టే కొల్లేరును ఖాళీ చేయడానికి వారు అంగీకరిస్తారా? అన్నదే అంతుచిక్కని ప్రశ్న. ఏదైనా సరే ప్రభుత్వం మునుముందు తీసుకోబోయే చర్యలే కొల్లేరు భవితవ్యంను తేలుస్తాయని వ్యాఖ్యాలు వినిపిస్తున్నాయి.

# మంకీపాక్స్ వైరస్ వచ్చేస్తుంది జాగ్రత్త..

## రాష్ట్రాలకు కేంద్రం కీలక సూచనలు..!

## -దేశంలో తొలికేసు నమోదు..




ఆంధ్ర ప్రగతి న్యూఢిల్లీ సెప్టెంబర్ 11: ప్రపంచాన్ని వణికించిన కరోనా వైరస్ ఇప్పుడిప్పుడే కనుమరుగవుతోంది. దాదాపు నాలుగేళ్ల తరువాత కేసుల సంఖ్య గణనీయంగా తగ్గాయి. దీంతో కరోనా వైరస్ ముప్పు పూర్తిగా తొలగిపోయినట్లేనని భావిస్తున్న సమయంలో మరో వైరస్ టెన్షన్ పెడుతోంది. ఆఫ్రికన్, యూరోపియన్ దేశాల్లో హడలెత్తించిన మంకీపాక్స్ వైరస్ భారత్ లోకీ ప్రవేశించింది. మంకీపాక్స్ మహమ్మారి తీవ్రతను ఎదుర్కొంటున్న దేశం నుంచి ఇటీవలే భారత్ కు వచ్చిన ఓ యువకుడికి మంకీపాక్స్ వైరస్ పాజిటీవ్ గా నిర్ధారణ అయినట్లు ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. ఢిల్లీ ఎయిర్ పోర్టులో మంకీపాక్స్ వైరస్ సోకిన అనుమానిత వ్యక్తిని గుర్తించిన అధికారులు.. ఐసోలేషన్ కు తరలించారు. రోగి నుంచి రక్త నమూనాలను సేకరించి ఎంపాక్స్ నిర్ధారణ కోసం ల్యాబ్ కు పంపించగా.. పాజిటివ్ గా నిర్ధారణ అయింది. దీంతో భారత్ లో మంకీపాక్స్ వైరస్ పై ఆందోళన వ్యక్తమవుతోంది.ప్రాణాంతక మంకీపాక్స్ పై కేంద్రం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను అప్రమత్తం చేసింది. మంకీపాక్స్ వైరస్ లక్షణాలు కలిగిన వారిని గుర్తించి పరీక్షలు చేయించాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. అదేవిధంగా ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయాలని చెప్పింది. అయితే, మంకీఫాక్స్ వైరస్ పై ప్రజల్లో అనవసర భయాందోళనలు తలెత్తకుండా చూడాలని, ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర సోమవారం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖ రాశారు.ఆఫ్రికా దేశాల్లో మంకీపాక్స్ వ్యాప్తి ఆందోళనకర రీతిలో ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) పేర్కొంటుంది. 2022 జనవరి నుంచి 2024 ఆగస్టు వరకు 120 దేశాల్లో లక్షకుపైగా మంకీపాక్స్ కేసులు నమోదయ్యాయని, 220 మంది చనిపోయారని డబ్ల్యూహెచ్ఓ వెల్లడించింది.అమెరికన్ హెల్త్ ఏజెన్సీ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) నివేదిక ప్రకారం.. మంకీపాక్స్ వైరస్ సోకిన రోగి లాలాజలం, చెమట, వైరస్ సోకిన వ్యక్తి వినియోగించిన వస్తువుల ద్వారా ఆరోగ్యకరమైన వ్యక్తికి మంకీపాక్స్ వైరస్ ఎటాక్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గర్భిణీ స్త్రీల నుంచి ఆమె బిడ్డకు కూడా ఈ వైరస్ సక్రమిస్తుంది.

మంకీపాక్స్ వైరస్ లక్షణాలు కనిపించడానికి ఒకటి నుంచి నాలుగు రోజులు సమయం పట్టే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. తలనొప్పి, జ్వరం, కండరాల నొప్పి, చలి, ఒంటిపై దద్దుర్లు, గొంతు వాపు వంటి లక్షణాలు ఈ వైరస్ సోకిన వారిలో సాధారణంగా కనిపిస్తాయి.

# బాబు గారూ మీ 'బ్రాండ్' నిలబెట్టుకోండి.!

## -ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైయస్ షర్మిల.సీఎం చంద్రబాబును ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు



అమరావతి ఆంధ్ర ప్రగతి సెప్టెంబర్ 11: ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల.. సీఎం చంద్రబాబును ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మారు మూల వారికి ఇంకా సాయం అందడం లేదని తెలిపారు. వారికి కూడా సాధ్యమైనంత వేగంగా సాయం అందించి.. మేలు చేయాలని .. మీ బ్రాండ్ నిలబెట్టుకోవాలని ఆమె సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మీరు నేరుగా పర్యటించారు. మేం సంతోషించాం. కానీ, బాధితులకు అందుతున్న సాయంలో అనేక లోపాలు ఉన్నాయి. వాటిని సరిదిద్దాల్సిన అవసరం ఉంది అని షర్మిల పేర్కొన్నారు.ప్రజల బాధలు వినని ప్రభుత్వాలు ఎల్లకాలం మనలేవని, దీనికి వైసీపీపాలనే ఉదాహరణ అని షర్మిల వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అందుతున్న సాయం చాలా మందికి చేరడం లేదని.. వారంతా ఆకలి కేకలు పెడుతున్నట్టు తమకు తెలిసిందని షర్మిల చెప్పా రు. అందరినీ ఆదుకునేందుకు మీ అనుభవాన్ని ఉపయోగించి.. మీరు సేవ చేయాలని కోరుతున్నామని తెలిపారు. "మంచి పరిపాలకుడిగా మీరు పేరుంది. దానిని నిలబెట్టుకోవాలని కోరుతున్నాం" అని అన్నారు. బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు మరింత ప్రయత్నించాలని అన్నారు.ప్రజల బాధలు వినని ప్రభుత్వాలు ఎల్లకాలం మనలేవని, దీనికి వైసీపీపాలనే ఉదాహరణ అని షర్మిల వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అందుతున్న సాయం చాలా మందికి చేరడం లేదని.. వారంతా ఆకలి కేకలు పెడుతున్నట్టు తమకు తెలిసిందని షర్మిల చెప్పా రు. అందరినీ ఆదుకునేందుకు మీ అనుభవాన్ని ఉపయోగించి.. మీరు సేవ చేయాలని కోరుతున్నామని తెలిపారు. "మంచి పరిపాలకుడిగా మీరు పేరుంది. దానిని నిలబెట్టుకోవాలని కోరుతున్నాం" అని అన్నారు. బుడమేరు వరదల ప్రాంతాల్లో ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు మరింత ప్రయత్నించాలని అన్నారు.